క్లుప్తంగా

పారిజాతగిరిలో పూజలు



జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు గిరి ప్రదక్షిణ చేసి స్వామిని దర్శించారు. దాతల సహకారంతో భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించినట్లు ఈవో కలగర శ్రీనివాస్ తెలిపారు. ఆలయానికి విరాళాల ద్వారా రూ.32,270, పూజా టిక్కెట్ల రూపంలో రూ.13,095, ప్రసాదాల ద్వారా రూ.38,980 వెరశి మొత్తం రూ.84,345 ఆదాయం లభించిందన్నారు. గణపవరానికి చెందిన అల్లూరి సోమేశ్వరరావు కుటుంబసభ్యులు స్వామివారికి 100 కంచాలు, 100 గ్లాసులు సమర్పించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



రాజవరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా రాజవరం ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం కంటి పరీక్షలు నిర్వహించారు. కొయ్యలగూడెం పీహెచ్‌సీ వైద్యుడు సీహెచ్ చక్రవర్తి 310 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా 14 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి, కళ్లజోళ్లు సమకూర్చాల్సిందిగా ఏలూరు అంధత్వ నివారణ సంస్థ అధికారులకు సిఫార్సు చేశారు. బయ్యనగూడెం పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్ బాషా, ఏఎన్‌ఎం పి.సుజాత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బస్సు



అమ్మపాలెంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న స్కూల్ బస్సు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌కు చెందిన బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. మలుపు తిప్పుతున్న సమయంలో బస్సు వెనుక భాగం స్తంభాన్ని ఢీకొనడంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



విద్యుత్ పనులు నిర్వహిస్తున్న సిబ్బంది

వేలేరుపాడు: గత నాలుగు రోజులుగా గోదావరి వరద కారణంగా, విద్యుత్ సరఫరా నిలిచిపోయిన గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. గోదావరి వరద వల్ల నీట మునిగిన విద్యుత్ లైన్ బయటపడటంతో విద్యుత్ శాఖ ఎస్ఈ సల్మాన్‌రాజ్ పర్యవేక్షణలో త్వరితగతన మరమ్మతులు చేపట్టి వేలేరుపాడు మండలంలోని కోయిదా ఫీడర్ పరిధిలోని 28 గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ ఈఈ (ఆపరేషన్స్) పీర్.అహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఏడీఏ రమేష్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అపస్మారక స్థితిలో గుర్తు తెలియని మహిళ



ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

జంగారెడ్డిగూడెం: స్థానిక ఏరియా ఆసుపత్రిలో అపస్మారక స్థితిలో గుర్తు తెలియని మహిళ చికిత్స పొందుతోంది. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బేబీ కమల మాట్లాడుతూ గత నెల 26వ తేదీన జీలుగుమిల్లి రోడ్డు పక్కన ఓ మహిళ పడిపోయి ఉందన్న సమాచారంతో 108 సిబ్బంది ఆమెను స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెకు అప్పటి నుంచి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం విషమించిందని, మహిళ వివరాలు తెలిస్తే స్థానిక ఏరియ ఆసుపత్రిని సంప్రదించాలని సూపరింటెండెంట్ కోరారు.

కొందరికే అన్నదాత సుఖీభవ

- ప్రభుత్వ నిర్వాకంతో అర్హత ఉన్నా అందని లబ్ధి
- నిర్వాసిత రైతుల గగ్గోలు



ముంపులేని ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న పత్తి పంట

కుక్కునూరు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందిస్తున్నామని చెబుతున్న అన్నదాత సుఖీభవ పథకం కుక్కునూరు మండలంలోని నిర్వాసిత రైతుల్లో కొందరికీ ఇంతవరకు జమకాలేదు. దీంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు కూడా అన్నదాత సుఖీభవ పథకం అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు. పోలవరం భూసేకరణ అనంతరం ప్రభుత్వం 2017లో మండలానికి సంబంధించి వెబ్ ల్యాండ్‌ను ఫ్రీజ్ చేసింది. ఫ్రీజింగ్ కారణంగా ఆనాటి నుంచి నేటి వరకు భూములకు సంబంధించి మ్యూటేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. దీని కారణంగా పట్టాదారులు మృతి చెందితే వారి స్థానంలో వారసులు పేరు మార్పు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. కాగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.7 వేలు జమచేసేందుకు నిర్వహించిన సర్వేలో కేవలం బ్రతికున్న పట్టాదారులను మాత్రమే అర్హులుగా గుర్తించింది. పట్టాదారు మృతి చెందిఉంటే వారి వారసులను అనర్హులుగా పేర్కొంది. దీంతో మండలంలో దాదాపు 2 వేల మంది రైతులు అర్హత ఉండి కూడా పథకానికి అనర్హులుగా పేర్కొనబడ్డారు.

రైతుల్లో వ్యతిరేకత

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పట్టాదారులు లేకపోతే వారి వారసులకు పథకం వర్తింపచేసి వైఎస్సార్ రైతు భరోసాను రైతుల ఖాతాలలో జమచేశారు. ఈ విషయమై గత ప్రభుత్వంతో పోల్చుతూ కూటమి ప్రభుత్వంపై స్థానిక రైతుల్లో పెద్దెత్తున వ్యతిరేకత వ్యక్తం అయింది. దీంతో స్థానిక అధికారులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో వారం రోజుల గడువుతో వారసులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. అప్పుడు దరఖాస్తు చేసుకున్నవారిలో కూడా కొందరికే పథకం సొమ్ము జమైంది. చాలా మందికి జమకాలేదని రైతులు వాపోతున్నారు. అంతేకాక వెబ్‌ల్యాండ్ ఫ్రీజ్‌లో లేకపోయి ఉంటే మార్పులు చేసుకునేందుకు అవకాశం ఉండేదని వెబ్‌ల్యాండ్ ఫ్రీజ్ చేసింది ఆనాడు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వమేనంటున్నారు. ప్రభుత్వం చేసిన తప్పుకు రైతులు శిక్ష అనుభవించాలా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ప్రభుత్వం వెంటనే ఈ విషయమై చర్యలు చేపట్టి నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మాకు అన్నదాత సుఖీభవ రాలేదు



మాకు కుక్కునూరు పంచాయతీ పరిధిలోని ఇసుకపాడు గ్రామంలో సాగుభూమి ఉంది. ఆ భూమి మా నాన్న వడ్డే వీర్రాజు పేరున ఉంది. మా నాన్న మృతి చెందారు. అమ్మ జీవించే ఉన్నా అన్నదాత సుఖీభవ క్రింద ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం జమకాలేదు.

– వడ్డే రఘుబాబు, ఇసుకపాడు, కుక్కునూరు

అర్హత ఉన్నా పథకం అందలేదు



మాకు ఐదెకరాల సాగు భూమి ఉంది. ఆ భూమిలో ప్రస్తుతం పత్తిని సాగు చేస్తున్నాను. మా నాన్న పేరున భూమి ఉందని ముందుగా అన్నదాత సుఖీభవ పథకంలో అనర్హుడిగా పేర్కొన్నారు. మరలా దరఖాస్తు చేసుకోనే సరికి సిస్టమ్ పనిచేయడం లేదన్నారు. అర్హత ఉండి కూడా ప్రభుత్వ నిర్వాకంతో పథకం పొందలేకపోయా.

– మడకం వీరయ్య, రైతు, కుక్కునూరు

350 మందికి రావాలి



ప్రభుత్వం మరోసారి అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో మా వద్దకు వచ్చిన 1,200 మంది లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. వారిలో 350 మందికి తప్ప తక్కిన వారందరికి పథకం సొమ్ము జమైంది.

– ఆర్ బాలాజీ, మండల వ్యవసాయ శాఖాధికారి, కుక్కునూరు

పరిశుభ్రతతో దోమలను తరిమికొడదాం

చింతలపూడి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నర్విహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా పి శ్రీనివాసరావు, కమిటీ సమన్వయకర్త జి జీవన మౌనిక మాట్లాడుతూ పరిశుభ్రతను పాటించడం ద్వారా దోమలను తరిమికొట్టి వ్యాధులనుంచి రక్షణ పొందాలన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞను చేశారు. కళాశాల నీటి ట్యాంకులను, తరగతి గదులను, ప్రాంగణాన్ని శుభ్రపరచి, దోమల మందు స్ప్రే చేశారు. ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎ. వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా నూకాలమ్మ

జంగారెడ్డిగూడెం: శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక నూకాలమ్మ ఆలయంలో అమ్మవారిని శాకాంబరీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠం నిర్వాహకులు బ్రహ్మశ్రీ గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి ప్రవచన కార్యక్రమంలో శ్రావణమాస విశిష్టతను తెలియజేశారు. అనంతరం ఆలయ కమిటీ భక్తిశ్రద్ధలతో గురు సత్కారం చేశారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం చందన బ్రదర్స్ వద్ద శనివారం మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని మున్సిపల్ కమీషనర్ కేవీ రమణ ప్రారంభించారు. వినాయక చవితి పండుగలో ప్రజలు మట్టి వినాయకులను తీసుకువెళ్లాలని యాజమాన్యం కోరింది. కార్యక్రమంలో కొంతేటి షణ్ముఖరావు, బ్రహ్మం పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంపై అమావాస్య ఎఫెక్ట్



భక్తుల లేమితో వెలవెలబోతున్న శ్రీవారి ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంపై శనివారం అమావాస్య ఎఫెక్ట్ పడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ప్రతి శనివారం వేలాది మంది భక్తులు క్షేత్రాన్ని సందర్శించేవారు. అయితే ఈ వారం అమావాస్య కావడంతో ఆ ప్రభావం భక్తుల రద్దీపై తీవ్రంగా చూపింది. ఉదయం నుంచి నామమాత్రపు భక్తులతో కనిపించిన ఆలయ పరిసరాలు, మధ్యాహ్నం నుంచి నిర్మానుష్యంగా మారాయి. దాంతో ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, కల్యాణ కట్ట తదితర విభాగాలు భక్తుల లేమితో వెలవెలబోయాయి. ఆదివారం భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉందని ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

పరామర్శ



బాబూరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

లింగపాలెం: మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గం కన్వీనర్ తానేటి వనిత, శ్రీనివాస్ దంపతులను తాడేపల్లిగూడెంలోని వారి నివాసంలో పార్టీ నాయకులు, లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్ శనివారం పరామర్శించారు. శ్రీనివాస్ తండ్రి బాబూరావు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో వనిత దంపతులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వీరితో పార్టీ నేతలు సొంగా చినబాబు, సింగిరెడ్డి అశోక్, పార్టీ అభిమాని సొంగా వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ



పోలవరం మండలం కృష్ణారావుపేట సొసైటీలో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: మండలంలోని కృష్ణారావుపేట, పట్టిసీమ, గుటాల సహకార సంఘాలను శనివారం జిల్లా సహకార శాఖ అధికారి ఎ.శ్రీనివాస్, విభాగ సహకార అధికారి కె.సత్యవతి సందర్శించి ఎరువుల గోడౌన్‌లను, ఎరువుల అమ్మకాలు, నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి మాట్లాడుతూ జిల్లాలో యూరియ రైతుల అవసరాలకు సరిపడా ఉన్నట్లు తెలిపారు. రైతులు ఏ విధమైన ఆందోళన చెందవద్దని అవసరానికి మించి యూరియ కొనుగోలు చేయవద్దని రైతులను కోరారు. పోలవరం మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి కృష్ణారావుపేట పీఏసీఎస్ ద్వారా 218 టన్నులు, గుటాల పీఏసీఎస్ ద్వారా 92 టన్నులు, కొత్త పట్టిసీమ పీఏసీఎస్ ద్వారా 88 టన్నులు, పాత పట్టిసీమ పీఏసీఎస్ ద్వారా 87 టన్నులు వెరసి మొత్తం 485 టన్నులు యూరియ రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాంబాబు, కృష్ణారావు పీఏసీఎస్ అధ్యక్షుడు కొణతాల ప్రసాద్, పాత పట్టిసీమ అధ్యక్షుడు సునకాని రాంబాబు, కొత్త పట్టిసీమ ప్రత్యేక అధికారి ఎస్‌కే నజీర్ పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో...

కొయ్యలగూడెం: వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా కొయ్యలగూడెం మండలంలోని హోల్‌సేల్ ఎరువులు దుకాణాలలో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి ఎంవీ రమణ, కేఆర్ పురం సహాయ వ్యవసాయ సంచాలకులు పీజీ బుజ్జిబాబు నేతృత్వంలో తనిఖీలు చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ ఎరువల డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏడీఏ పీజీ బుజ్జిబాబు మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులే కాకుండా నానో ఎరువులు కూడా వినియోగించడం అలవాటు చేసుకోవాలన్నారు. హోల్‌సేల్ డీలర్లు తమకు వచ్చిన అన్ని ఎరువులను డివిజన్ పరిధిలో ఉన్న రిటైల్ డీలర్లకు మాత్రమే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కేవీఎన్ పోసారావు, తహసీల్దార్ ఎన్.నాగరాజు, వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా శనివారం జంగారెడ్డిగూడెంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులు ఆన్‌లైన్, భౌతికంగా ఉన నిల్వలలను పరిశీలించారు. వ్యవసాయాధికారి సి.పవన్‌కుమార్, తహసీల్దార్ కె.స్లీవజోజి మాట్లాడుతూ యూరియా, ఇతర ఎరువులను రైతులకి ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలన్నారు. లక్కవరంలో కూడా ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.

డీఎస్సీలో హరీష్‌కి జిల్లా సెకండ్ ర్యాంక్



పరసా హరీష్

ద్వారకాతిరుమల: డీఎస్సీ గణిత విభాగంలో వేంపాడు గ్రామానికి చెందిన పరసా హరీష్ జిల్లా రెండో ర్యాంక్ సాధించి అందరి మన్ననలు పొందాడు. రైతు కుటుంబంలో జన్మించిన హరీష్ తల్లిదండ్రులు సత్యన్నారాయణ, వరలక్ష్మి సహకారంతో, ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలన్న దృఢ సంకల్పంతో ఇంటి వద్దే ఉంటూ, ఆన్‌లైన్ యాప్స్ ద్వారా సన్నద్ధమై డీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటాడు.

ప్రజల దృష్టిని మరల్చేందుకు రెడ్‌బుక్ రాజ్యాంగం



పొంగుటూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పొంగుటూరులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

కొయ్యలగూడెం: ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు సీఎం చంద్రబాబు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు అన్నారు. పొంగుటూరు గ్రామంలో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా మొత్తం 143 హామీలు నెరవేరుస్తానని చంద్రబాబు ప్రజలకు వాగ్దానం చేశారని, వాటిని అమలు చేయలేక ప్రపంచంలోనే అపనమ్మకమైన వ్యక్తిగా చరిత్రలో మిగిలిపోతారని ఎద్దేవా చేశారు. జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మీ మాట్లాడుతూ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫర్స్ అనే జాతీయ సర్వే సంస్థ దేశంలోనే అత్యంత సంపద కలిగిన ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నారని నివేదిక ఇచ్చిందన్నారు. కేవలం రెండు ఎకరాల ఆసామిగా రాజకీయ జీవితం ప్రారంభించిన చంద్రబాబు రూ.931 కోట్లకు అధిపతి ఎలా కాగలిగాడు అనేది ప్రజలు గ్రహించాలన్నారు. ఎంపీపీ గంజిమాల రామారావు, సర్పంచ్ పసుపులేటి రాంబాబు, ఎంపీటీసీలు నేలపోలు దుర్గారావు, ఎస్‌కే బాజీ, పార్టీ శ్రేణులు నూకల రాము, గేలం శ్రీను, గేలం వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచి తానేటి రాజు, కైక వరపు గోపి, కంభంపాటి బుజ్జిబాబు, పూసల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుల పంపిణీ



మట్టి వినాయకుడిని కమిషనర్ రమణకు అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితికి ప్రజలు మట్టి వినాయకులనే వాడాలని మున్సిపల్ కమిషనర్ కేవీరమణ, పొల్యూషన్ కంట్రోల్ ఎనలిస్ట్ తేజస్విని అన్నారు. స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కళాశాలలో ప్రిన్సిపాల్ డా.ఎస్.ప్రసాద్ బాబు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ స్పార్క్ సేవా సంస్థ, స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, ఆధ్వర్యంలో పర్యావరణ అనుకూల వినాయక చవితి అవగాహన సదస్సు నిర్వహించారు. స్పార్క్ ఎన్జీవో సేవా సంస్థ సింహాద్రి త్రినాథ్, అధ్యాపకులు బి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎమ్.మధు, సీహెచ్ షాలిని తదితరులు మాట్లాడారు. తదనంతరం రెడ్ క్రాస్ పర్యావరణ పరిరక్షణ విభాగం కోఆర్డినేటర్ డా.గాళ్ళ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 100 మట్టి వినాయక విగ్రహాలను కళాశాల విద్యార్థులు ప్రజలకు అందించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కొయ్యలగూడెం: బయ్యనగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డా.ఎం.గీతారాణి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కొంత సమయం కేటాయించాలన్నారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ సైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

లింగపాలెం: మండలంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర నిర్వహించారు. డ్రెయినేజీలను శుభ్రం చేశారు. పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. .

ఇస్త్రీపెట్టె అందజేత

జంగారెడ్డిగూడెం: స్థానిక వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతలు బుద్దాల సతీష్, కుమారి సహకారంతో స్థానిక ఇందిరానగర్‌కు చెందిన కామరాజు, వరమ్మకు శనివారం ఇస్త్రీ పెట్టె అందించారు. వారి ఇస్త్రీ పెట్టె దొంగతనానికి గురి కావడంతో జీవనోపాధికి ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ సహాయం అందించారు.

సచివాలయం ప్రారంభోత్సవం ఎప్పుడో?



అలివేరు వద్ద ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన అలివేరులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల భవనాలు ప్రారంభోత్సవం కోసం ఎదురు చూస్తున్నాయి. భవనాలు పూర్తయి నెలలు గడుస్తున్నా భవన ప్రారంభోత్సవానికి మాత్రం అధికారులు చర్యలు తీసుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని మారుమూల గ్రామాలైన అలివేరు, లంకపాకల, రేగులపాడు, రేపల్లె, దోలుగండి, ఎర్రాయిగూడెం, చింతకొండ, గొట్టాలరేవు, తదితర గ్రామాల గిరిజనులకు ప్రభుత్వ సేవలు అందించాలనే ఉద్దేశంతో సుమారు రూ.40 లక్షల వ్యయంతో గ్రామ సచివాలయ భవనం నిర్మించారు. రైతు భరోసా కేంద్రాన్ని కూడా నిర్మించారు. అందంగా రంగులతో ముస్తాబై ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నా దానిని ప్రారంభించడానికి అధికారులు చొరవ చూపడం లేదు. స్థానిక సర్పంచ్ కారం లక్ష్మి, ఎంపీటీసీ కొవ్వాసి గోవిందరాజులు ప్రజాప్రతినిధులు, అధికారులకు అనేకసార్లు భవనాన్ని ప్రారంభించాలని విజ్ఞప్తి చేసినా ఫలితంలేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనం ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

సీఎస్‌టీఎస్ కళాశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.అరుణ్

జంగారెడ్డిగూడెం: స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.ఎస్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో గణనీయమైన పురోగతిని సాధించిందన్నారు. స్వశక్తితో ఎన్నో పరిశోధనలు నిర్వహించడం, దేశానికి గర్వకారణంగా నిలిచిందన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల మహిళా కళాశాల కంచికర్ల భౌతిక శాస్త్ర అధ్యాపకుడు ఎం.అరుణ్, అధ్యాపకుటు టీవీ రాంబాబు మాట్లాడుతూ 2040వ సంవత్సరం నాటికి భారతదేశం చంద్రునిపై మానవ సహిత అంతరిక్ష నౌకను ఏర్పాటు చేయగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.

సురవరం మృతి తీరని లోటు



చింతలపూడిలో సురవరం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

చింతలపూడి: సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మృతి సీపీఐకి తీరని లోటు అని ఆ పార్టీ మండల కార్యదర్శి తోర్లపాటి బాబు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి విద్యార్థి దశ నుంచే అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని అన్నారు. 21 సంవత్సరాలకు ఉన్న ఓటు హక్కును 18 సంవత్సరాలకే ఓటు హక్కు కావాలని ఉద్యమించారని చెప్పారు. సంతాపం తెలిపిన వారిలో సీనియర్ నాయకులు మామిళ్ళపల్లి వసంతరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచర్ల గురవయ్య, దొంతా కృష్ణ, తోర్లపాటి రాజు, పుల్లూరి సోమశేఖర్, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో సంస్మరణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ శనివారం సీపీఐ పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించారు. సీపీఐ మండల కన్వీనర్ తాడిగడప ఆంజనేయరాజు మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి ఏఐఎస్ఎఫ్ విద్యార్థి దశ నుంచి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పార్లమెంట్ సభ్యునిగా దేశానికి రాష్ట్రానికి ఎంతో విలువైన సేవలు అందించిన మహోన్నత వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి లక్క లక్ష్మణరావు, ఏఐటీయూసీ నాయకులు వెలగల నాని, మట్టా రామకృష్ణ, దుర్గారావు, చంద్రశేఖర్, వెలగల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఈశా ఫౌండేషన్ గ్రామోత్సవం



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని ప్రధాన ఆశయంతో ఈశా ఫౌండేషన్ గ్రామోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఈశా ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. శనివారం జంగారెడ్డిగూడెంలోని గవర్నమెంట్ డిగ్రీ కళాశాల మైదానంలో 17 వ గ్రామోత్సవ వాలీబాల్ పోటీలను మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ ప్రారంభించారు. ఏలూరు జిల్లా స్థాయిలో రెండు రోజుల పాటు జరిగే ఈ గ్రామోత్సవంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన 36 వాలీబాల్ టీమ్‌లు పాల్గొంటున్నాయని ఈశా ప్రతినిధులు తెలిపారు. ఆదివారం జరిగే ఫైనల్స్‌లో విజేతలకు బహుమతి ప్రధానం జరుగుతుందన్నారు.

ఆంధ్ర కేసరి జయంతి



ప్రకాశం పంతులుకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. గవరవరంలోని శ్రీ సుందర సీతారామ ఫంక్షన్ హాలులో కొయ్యలగూడెం ప్రాంతీయ సంఘం ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సైమన్ గో బ్యాక్ నినాదంతో ప్రకాశం పంతులు ఆంధ్ర కేసరిగా బిరుదు పొందారని సంఘ నాయకులు పేర్కొన్నారు. అదేవిధంగా లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు జయంతి నిర్వహించి నివాళులు అర్పించారు. సంఘ అధ్యక్షుడు అనిపెద్ది రాధాకృష్ణమూర్తి, కార్యదర్శి మామిళ్ళపల్లి బద్రీనాథ్, కోశాధికారి పెడసనగంటి అప్పారావు శర్మ, సభ్యులు పాల్గొన్నారు.